పొత్తుల ముసలం

◆ అనకాపల్లిలో జనసేనకు పరుచూరి రాజీనామా ◆ కొణతాలకు ప్రతికూలత ◆ టిడిపిలో తగ్గని అసంతృప్తి ◆ పవన్ పార్టీకి సహాయ నిరాకరణ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, అనకాపల్లి విలేకరి

టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో ముసలం ఆరంభమైంది. ఇమడలేక రాజీనామాల దిశగా నేతలు ఆలోచిస్తున్నారు. జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పరుచూరి భాస్కరరావు రాజీనామాతో దీనికి బోణీ పడింది. టిడిపి, జనసేనల్లో అసంతృప్తులు తీవ్రరూపం దాల్చుతున్నాయి. పై నుంచి ఎంత సర్దిచెప్పే ప్రయత్నాలు చేసినా కిందిస్థాయిలో కలిసి పనిచేయలేని వాతావరణం వుంది. ఒకసారి టిక్కెట్ రాకపోతే రాజకీయంగా బలహీన పడతామన్న అభిప్రాయం జనసేన పోటీచేసే నియోజకవర్గాల్లోని టిడిపి శ్రేణుల నుంచి వ్యక్తమవుతోంది. పొత్తులో మూడు పార్టీలూ కలిసి పనిచేయలేని పరిస్థితులు క్షేత్రస్థాయిలో బలపడుతున్నాయి. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసిన తనకు టిక్కెట్ ఇవ్వకపోవడమే కాకుండా, పవన్ కల్యాణ్‌ను కలవడానికి వెళితే అవకాశం కూడా ఇవ్వకపోవడాన్ని అవమానంగా భావిస్తూ జనసేనకు రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం పరుచూరి భాస్కరరావు ప్రకటించారు. ఆయనతో పాటు అనుచరులూ జనసేనకు రాజీనామా చేశారు. పార్టీకి కష్టపడిన వాళ్లను కాదని, ఎన్నికల ముందు వచ్చిన వారికి టిక్కెట్లు ఇవ్వడాన్ని సొంతపార్టీలోనూ నాయకులు జీర్ణించుకోలేని స్థితివుంది. భాస్కరరావు రాజీనామాతో అనకాపల్లి జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణకు ప్రతికూల పరిస్థితులు ఎదురుకానున్నాయి. జనసేన కార్యకర్తలతో రామకృష్ణకు బలమైన పరిచయాల్లేవు. భాస్కరరావు సహకారం అవసరమని భావించే టిక్కెట్ కేటాయించిన తరువాత మొట్టమొదట కొణతాల ఆయన్ను కలిశారు. ఇపుడు ఆయన రాజీనామాతో కొణతాలకు జనసేన కార్యకర్తలతో పనిచేయించుకోవడం సమస్య కానుంది. టిడిపి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ బంధుత్వరీత్యా కొణతాల విజయానికి పనిచేసినట్లు బయటకు కనిపించినా, తనపట్టు కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకొనే అవకాశం లేకపోలేదు. దాడి వీరభద్రరావు సహకారం కొణతాలకు అంతంతమాత్రంగానే ఉంటుందని పలువురు చెబుతున్నారు.

రాజీనామా ప్రకటిస్తున్న పరుచూరి భాస్కరరావు

పెందుర్తి, యలమంచిలిలో ఇలా..

పొత్తులో పెందుర్తి టిక్కెట్ టిడిపి సీనియర్ నాయకుడు బండారు సత్యనారాయణమూర్తికి ఇవ్వకుండా జనసేనకు కేటాయించడంతో టిడిపి కార్యకర్తలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ జనసేన నుంచి పోటీచేయనున్న మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పట్ల సొంతపార్టీలోనూ వ్యతిరేకత వుంది. ఎంతోకాలంగా పనిచేసిన శివశంకర్‌ను కాదని, మధ్యలో వచ్చిన పంచకర్లకు టిక్కెట్ ఇవ్వడాన్ని జనసేన కార్యకర్తలు వ్యతిరేకిస్తున్నారు. పొత్తు పార్టీలను కలుపుకొని పంచకర్ల వెళ్లాలనుకున్నా, ఆ పార్టీ నాయకులు మనస్ఫూర్తిగా ఆయనకు సహకరించే పరిస్థితి కనిపించడంలేదు.

యలమంచిలి టిక్కెట్ ఆ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ ప్రగడ నాగేశ్వరరావుకు ఇవ్వకుండా జనసేనకు కేటాయించడంతో ఆ పార్టీ కార్యకర్తల్లో అసంతృప్తి తగ్గలేదు. టిక్కెట్ రాని ప్రగడ శుక్రవారం పార్టీ కార్యకర్తల సమావేశంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేయాలని చెప్పినప్పటికీ విజయకుమార్‌తో గతం నుంచీ వున్న రాజకీయ విభేదాల రీత్యా వారు సహకరించే అవకాశం తక్కువగా ఉందని స్థానిక నేతలే చెబుతున్నారు.

ఉక్కు రక్షణే అజెండా

◆ నేడు స్టీల్‌ప్లాంట్ తృష్ణా గ్రౌండ్‌లో కాంగ్రెస్ బహిరంగ సభ ◆ కేంద్రంతో అంటకాగే రాష్ట్ర రాజకీయ పార్టీలకు గట్టి హెచ్చరిక ◆ ముఖ్య అతిథిగా తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి ◆ హాజరుకానున్న షర్మిల, సిహెచ్.నర్సింగరావు, రామకృష్ణ, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించడమే ప్రధాన అజెండాగా శనివారం సాయంత్రం 4 గంటలకు కాంగ్రెస్ ఆధ్వర్యాన స్టీల్‌ప్లాంట్ తృష్ణా గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభకు సన్నాహాలు జరుగుతున్నాయి. కేంద్రంలోని బిజెపితో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ అంటకాగుతున్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు ఎన్నికల నేపథ్యంలో ఈ సభ గట్టి హెచ్చరిక కాగలదని ఉత్తరాంధ్ర ప్రజానీకం భావిస్తున్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం 1128 రోజులుగా పోరాటం దిగ్విజయంగా నడుస్తోంది. 'ఉక్కు కర్మాగారాన్ని అమ్మేస్తాం.. లేదంటే మూసేస్తాం' అన్న కేంద్రంలోని బిజెపి మోడీ విధానాన్ని కార్మికవర్గం, విశాఖ ప్రజానీకం నిలువరించే ప్రయత్నాలను కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. 2024 ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల అజెండా కూడా ఇదే అవ్వాలన్న డిమాండ్ కార్మికవర్గం నుంచి వినిపిస్తోంది. అయితే, అమ్మేయాలని నిర్ణయం చేసిన బిజెపితో రాష్ట్రానికి చెందిన తెలుగుదేశం, జనసేన పార్టీలు పొత్తు పెట్టుకోవడం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు తూట్లు పొడిచేలా ఉందన్న ఆందోళన కార్మికవర్గం, ఈ ప్రాంత ప్రజానీకంలో వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో అధికారంలో కొనసాగుతున్న వైసిపి కూడా స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్రాన్ని నిలదీయలేని పరిస్థితుల్లో దాంతో నిమిత్తం లేకుండా సిపిఎం, వామపక్షాలు తొలినుంచీ కేంద్ర నిర్ణయంపై భగ్గుమంటూ ఉద్యమాల్లో భాగస్వామ్యం అవుతూ వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్ కోసం కాంగ్రెస్ స్టీల్‌ప్లాంట్ రక్షణకు అండగా నిలవడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం జరిగే భారీ బహిరంగ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎపిసిసి అధ్యక్షులు షర్మిల, సిపిఎం సీనియర్ రాష్ట్ర నాయకులు సిహెచ్.నర్సింగరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కాంగ్రెస్ రాష్ట్ర నేతలు రుద్రరాజు, రాకేష్ హాజరుకానున్నారు.

మోడీకి సరైన సమాధానం చెప్పాలన్న కాంక్ష

విశాఖ ఉక్కును రక్షించుకోవడానికి తలపెట్టిన ఈ బహిరంగ సభకు భారీగా ప్రజలు, కార్మికులు తరలిరానున్నట్టు సమాచారం. ఉక్కును ప్రైవేటీకరించాలని చూస్తున్న ప్రధాని మోడీకి ఈ సభ ద్వారా గట్టి హెచ్చరిక పంపాలన్న కాంక్ష అందిరిలో కనిపిస్తోంది. మోడీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 17న చిలకలూరిపేటలో బిజెపి, టిడిపి, జనసేన తలపెట్టిన సభకు విచ్చేస్తున్న సంగతి తెలిసిందే. శనివారం ఉక్కునగరంలో జరిగే సభను చూసైనా ప్రధాని మోడీ కళ్లు తెరవాలని పలువురు భావిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం భూములను త్యాగం చేసిన వారికి నేటికీ న్యాయం జరగకపోవడం, ప్లాంట్‌కు రా మెటీరియల్ కూడా ఇవ్వకుండా దివాళా తీయించే స్థితికి కేంద్రం తీసుకురావడం వంటి అంశాలపై నేతలు ప్రసంగించనున్నారు.

ప్రభుత్వ సిఫార్సు బదిలీలను నిలిపివేయాలి : యుటిఎఫ్

నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కౌన్సిలింగ్ విధానానికి వ్యతిరేకంగా సిఫార్సు బదిలీలను వెంటనే రద్దు చేయాలంటూ శుక్రవారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఇలాంటి బదిలీలను రద్దు చేయాలని, న్యాయ సమ్మతంగా నిర్వహించి అందరు ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.అప్పారావు, పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్.నాగమణి, జిల్లా సహధ్యక్షులు రొంగలి ఉమాదేవి, ఎన్.ప్రభాకర్, కోశాధికారి కె.రాంబాబు, కార్యదర్శులు టి.జగన్, చినగదిలి మండల ప్రధాన కార్యదర్శి పద్మావతి, గౌరవాధ్యక్షులు ఇ.సత్యనారాయణ పాల్గొన్నారు

అదానీ గంగవరం పోర్టు కాలుష్యాన్ని అరికట్టండి

- జగ్గు జంక్షన్ మీదుగా రాకపోకలను రద్దు చేయండి
- కలెక్టర్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు వినతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, గాజువాక : అదానీ గంగవరం పోర్టు నుండి వెదజల్లుతున్న రసాయనాలు, బొగ్గు, కాలుష్యాన్ని అరికట్టి గాజువాక వాసుల ఆరోగ్యాలను కాపాడాలని, జగ్గు జంక్షన్ మీదుగా గంగవరం పోర్టు భారీ వాహనాల రాకపోకలను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు, ఎపి కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్‌కు వినతిపత్రాలు అందజేశారు. గాజువాక 64వ వార్డు నుంచి 88 వార్డుల పరిధిలోని సుమారు 7 లక్షల మంది ప్రజలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నారన్నారు. తల్లి గర్భంలోని శిశువు మొదలు వృద్ధుల వరకు అందరూ ఏదో ఒక వ్యాధికి గురవుతున్నారని తెలిపారు. రసాయనాలు, బొగ్గుతో కూడిన దుమ్ము, ధూళిని నిరంతరం పీల్చాల్సివస్తోందని తెలిపారు. గాలి, రోడ్లు, ఇళ్లపైనే కాకుండా ఇళ్ల లోపలకు కూడా ఈ బూడిద వచ్చేస్తోందన్నారు. దీనికి ప్రధాన కారణం అదానీ గంగవరం పోర్టు యాజమాన్య నిర్లక్ష్య వైఖరేనని తెలిపారు. వేసవికాలం రావడంతో అదానీ పోర్టు దుమ్ము, ధూళి, కాలుష్యం తీవ్రత మరింత పెరిగిందని, ప్రజలు ఈ రసాయనాలు, దుమ్ము, కాలుష్యం పీల్చి అనారోగ్యాల పాలై వైద్యం కోసం వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. లక్షల రూపాయలు ఖర్చు పెట్టి కష్టపడి నిర్మించుకున్న ఇళ్లు పాడైపోతున్నాయని తెలిపారు. ఉతికిన బట్టలు ఇళ్ల మీద, ఆరుబయట ఆరవేస్తే నల్లగా మారిపోతున్నాయన్నారు. యారాడ కొండను దాటి మల్కాపురం ప్రాంతం 58 నుంచి 63 వార్డుల పరిధిలోని అన్ని ఇళ్లలోకి గంగవరం పోర్టు రసాయనాలు, బొగ్గు, కాలుష్యం వచ్చి పడుతున్నాయని తెలిపారు. సమస్యను ప్రభుత్వం, జిల్లా అధికారులు, గంగవరం పోర్టు యాజమాన్యం దృష్టికి తమ పార్టీ తీసుకెళ్లిందని, నిరసనలు చేపట్టిందని తెలిపారు. యాజమాన్యం తాత్కాలిక చర్యలు తీసుకోవడం తప్ప పూర్తి నివారణ చేయడం లేదన్నారు. గంగవరం పోర్టు ఏర్పాటుకు కేటాయించిన సుమారు 3 వేల ఎకరాల భూమి ప్రజలదని తెలిపారు. పోర్టు వల్ల మత్స్యకారులు తమ సముద్రవేటను, ఉపాధిని కోల్పోయారని, నిర్వాసితులుగా మారిపోయారని పేర్కొన్నారు. పోర్టులోపల పనిచేస్తున్న కార్మికులకు చట్టాలు అమలు చేయడం లేదన్నారు. పోర్టు వాహనాలు జగ్గు జంక్షన్ మీదుగా ప్రయాణిస్తున్నాయని, దీంతో ఆ మార్గంలోని కాలనీల ప్రజలతో పాటు కోర్టులు, మున్సిపల్ ఆఫీస్, తహశీల్దార్ కార్యాలయం, ఆరోగ్య కేంద్రాలకు రోజూ వచ్చి పోయే వేలాదిమంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ మార్గంలోనే స్టీల్‌ప్లాంట్, ఫార్మా తదితర కార్మికులు, ప్రజలు నిరంతరం ప్రయాణాలు సాగిస్తున్నారన్నారు. వారంతా పోర్టు వాహనాల వల్ల ప్రాణాలను అరచేతిలో పట్టుకొని ప్రయాణించాల్సి వస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

7న కృత్రిమ అవయవాల పంపిణీ శిబిరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాజస్థాన్‌లోని ఉదయపూర్‌కు చెందిన 'నారాయణ సేవా సంస్థాన్' ఆధ్వర్యంలో వచ్చే నెల 7న పోర్టు కళావాణి ఆడిటోరియంలో కృత్రిమ అవయవాల కొలతల శిబిరం నిర్వహిస్తున్నట్టు సంస్థాన్ ట్రస్టీ డైరెక్టర్ దేవేంద్ర చౌబీసా తెలిపారు. శుక్రవారం దసపల్లా హోటల్లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా నిర్వహిస్తున్న ఈ శిబిరంలో దాదాపు 1000 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కృత్రిమ చేతులు, కాళ్లు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. సంస్థాన్ ప్రజా సంబంధాల అధికారి భగవాన్ ప్రసాద్ గౌర మాట్లాడుతూ అత్యాధునిక టెక్నాలజీ ద్వారా ఈ కృత్రిమ అవయవాలను తయారు చేసి పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. వికలాంగులు తమ ఆధార్ కార్డు, రెండు ఫుల్ సైజు ఫొటోలు, సదరం సర్టిఫికెట్‌ను తీసుకురావాల్సి ఉందన్నారు. రిజిస్ట్రేషన్ నిమిత్తం 7230012630 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బంగారు రాజు, సన్ మూర్తి, ఎంవి.రాజశేఖర్, జగదీష్ పాల్గొన్నారు

వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు బిగించొద్దు

ప్రజాశక్తి-అనకాపల్లి : వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు మీటర్లు బిగించడం ద్వారా రైతులపై వేలాది రూపాయల అదనపు విద్యుత్ భారం పడుతుందని, తక్షణమే ప్రభుత్వం ఆ ప్రతిపాదనను విరమించాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ రైతులు అడ్డగించిన విద్యుత్ శాఖ అధికారులు మీటర్లు బిగించడం దారుణమన్నారు. దీనివలన వేలాది రూపాయలు రైతుల కట్టవలసి వస్తుందన్నారు. బిల్లులు కట్టకుంటే అధికారులు కనెక్షన్లు కట్ చేస్తారని, దీంతో రైతులు బిల్లుల కట్టలేక వ్యవసాయం కుదేలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విద్యుత్తు మీటర్లు బిగించకుండా రైతాంగం అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. 9 గంటల నాణ్యమైన విద్యుత్తు రైతాంగానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, కోశాధికారి గండి నాయనబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి. కోటేశ్వరరావు, రైతు సంఘం సీనియర్ నాయకులు బి. రంగారావు పాల్గొన్నారు.

వైసిపి విజయానికి కృషి చేయాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : రానున్న ఎన్నికల్లో వైసిపి విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని వేట జంగాల పాలెం గ్రామంలో శుక్రవారం భరత్ కుమార్ సమక్షంలో పలువురు టిడిపి కార్యకర్తలు గ్రామ వైసిపి నాయకులు బొడ్డు యాకబ్ ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి భరత్ కుమార్ ఆహ్వానించారు. వైసిపిలో చేరిన వారిలో టిడిపి వార్డు మెంబరు ఉగ్గిన అప్పారావు, సాలపు శంకర్ శ్రీను, బొండా నాయుడు, బొండా దేముడు, నారాపిన్ని శీను, నందికొల్లు జాను, మరో 25 మంది ఉన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ కరక సోమనాయుడు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో ఆత్మ పిడి ఎం.ఆశాదేవి ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక రైతులతో క్షేత్ర పాఠశాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పొలాలను సందర్శించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, మండల ఎఒ సిహెచ్ జోష్నకుమారి, డిటిసి డిఆర్‌సిఏఓ వి.తులసీమణి, డిఆర్పిఏఈఓ ఎన్ సాయివాణి, విఎఎ సత్య తులసి, రైతులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పి.భీమవరం గ్రామంలో శాస్త్రీయ సాగుపై శ్రీకాకుళం కింజరపు ఎర్రమనాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొండంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రాజకుమార్, కిషోర్ కుమార్, స్థానిక సర్పంచ్ పినపోలు రామునాయుడు, విద్యార్థులు శశికళ, పూజిత, శ్రావణి, పల్లవి, నిఖిత, తేజ, ప్రత్యూష, గ్రామ రైతులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సాగు విధానంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

కట్టుదిట్టంగా పదో తరగతి పరీక్షలు

- జిల్లాలో 108 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరు కానున్న 21,259 మంది విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈనెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరుగు 10వ తరగతి పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా, నిస్పక్షపాతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి వెబ్‌ఎక్స్ ద్వారా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో తన ఛాంబర్‌లో వివిధ శాఖల సిబ్బందితో పదో తరగతి పరీక్షలు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో 10వ తరగతి పరీక్షలకు మొత్తం 21,259 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, వీరిలో బాలురు 10,873మంది, బాలికలు 10,386 మంది రెగ్యులర్ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ప్రైవేట్ విద్యార్థులు మొత్తం సంఖ్య 2,324 మంది హాజరవుతున్నట్లు చెప్పారు. జిల్లాలో 108 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్షలు రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులను 8.45కు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారన్నారు. పరీక్ష సమయం పూర్తయిన పిదపే బయటకు వదలడం జరుగుతుందని చెప్పారు. ఆలస్యంగా వచ్చిన వారిని కేంద్రంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఎటువంటి పొరబాట్లు దొర్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. పరీక్షా కేంద్రాలకు మొబైల్ ఫోన్ల వంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను అనుమతించడం జరగదని, అధికారులకు సైతం ఇది వస్తుందని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. పరీక్షలకు విద్యార్థులు సకాలంలో హాజరయ్యేలా ఆర్‌టిసి బస్సులు నడపాలని, విద్యార్థులు హాల్ టిక్కెట్‌తో ఉచితంగా ప్రయాణించేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ మురళీకృష్ణ, డిఇఒ వెంకట లక్ష్మమ్మ, డిఆర్‌ఓ దయానిధి, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్‌డిఓలు డిఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, రవాణా ఇంఛార్జి కమిషనర్ ప్రకాష్, జిల్లా ప్రజా రవాణా అధికారి సుజాత, డిపిఒ శిరీషారాణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

సింబయో క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

కంపెనీ ఎదుట సిఐటియు నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ : అచ్యుతాపురం ఎస్ఇజెడ్ పరిధిలోని సింబయో జెనరిక్స్ ఫార్మా కంపెనీలో బుధవారం ఉదయం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురు కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సింబయో కంపెనీ ఎదుట శుక్రవారం సిఐటియు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము, జి దేవుడునాయుడు మాట్లాడుతూ సింబయోలో జరిగిన ప్రమాదంపైనా, కార్మికులు గాయపడిన విషయాన్ని గోప్యంగా ఉంచిన యాజమాన్యం వైఖరిపైనా సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. నిత్యం ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరుగుతున్నా ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్, లేబర్ అధికారుల పర్యవేక్షణ ఉండటం లేదని, కంపెనీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ప్రమాదంలో 85శాతం వరకు కాలిపోయిన ఎ.రాము, కె.నర్సింగరావులకు మెరుగైన వైద్యం అందించాలని, వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే బాధిత కుటుంబాలతో పెద్ద ఎత్తున కంపెనీ వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చందక రామకృష్ణ, వై రాము, నాయుడు, నర్సింగరావు, ఆర్.రాంబాబు, చింతకాయల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

సింబయో కంపెనీ ఎదుట నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

జగన్ పాలనకు చరమగీతం

ప్రజాశక్తి-అనకాపల్లి : వచ్చే ఎన్నికల్లో జగన్ పాలనకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు చరమగీతం పాడబోతున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. స్థానిక టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమికి ప్రజలు పట్టం కట్టనున్నట్లు జాతీయ మీడియా సంస్థలు అంచనా వేశాయని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనబడుతుందని, జగన్ రెడ్డి గద్దె దిగే రోజు దగ్గర్లోనే ఉందని పేర్కొన్నారు.

19లోగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ తరలింపు రికార్డుల పరిశీలనకు అనుమతించండి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జాయింటు సబ్ రిజిస్ట్రారు కార్యాలయం తరలింపు రికార్డుల పరిశీలనకు ఈ నెల 19లోగా దరఖాస్తుదారున్ని అనుమతించాలని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ (ఎస్‌సీఐసీ) ఆర్.మహబూబ్ బాషా శుక్రవారం ఆదేశించారు. రికార్డుల పరిశీలనకు అనుమతి ఇవ్వడంపై జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్‌లు దాటవేత ధోరణితో పొంతన లేని సమాధానాలివ్వడం పట్ల మహబూబ్ బాషా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్ రిజిస్ట్రారు కార్యాలయం తరలింపు ఫైళ్లు పరిశీలన విషయమై రాష్ట్ర సమాచార కమిషన్‌లో దాఖలైన కేసు వర్చువల్ విధానంలో ఆయన విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలనా అనుమతుల్లేకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రభుత్వం తరలించమందా? వాస్తవమైతే ఆ ఉత్తర్వులు బహిర్గతం చేయాలని హుకుం జారీ చేశారు. ఈ వ్యవహారంలో గోప్యత ఎందుకు పాటిస్తున్నారంటూ నిలదీశారు. భిన్నంగా వ్యవహరిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని బాషా హెచ్చరించారు.

ట్రయల్ కోర్టు అనుభవం ఎంతో అవసరం

ప్రజాశక్తి- సబ్బవరం : ట్రయల్ కోర్టులో వాదించడం ఒక కళ అని, న్యాయవాది ట్రయిల్ కోర్టులో ప్రాక్టీస్ చేస్తేనే కేసు ఫైలింగ్ దగ్గర నుండి పూర్తి అయ్యేంత వరకు వివిధ దశల మీద అవగాహన ఉంటుందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డివిఎస్ఎస్ సోమయాజులు అన్నారు. అలాంటి వారే న్యాయవాద వత్తిలో ఎక్కువగా రాణించే అవకాశం ఉంటుందని, ట్రయిల్ కోర్టు అనుభవం ఒక న్యాయవాదికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. స్థానిక దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్శిటీ ప్రో బోనో క్లబ్, లీగల్ ఇంక్యుబేషన్ సెంటర్ సహకారంతో శుక్రవారం 'ది ట్రయల్ అడ్వకేసీ వర్క్‌షాప్' నిర్వహించారు. దీనిని వర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ సూర్య ప్రకాశరావు ప్రారంభించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సోమయాజులు మాట్లాడుతూ ప్రతి దశలో ఎదురయ్యే సమస్యలు వాటిని ఎలా డిఫెన్డ్ చేసుకోవాలో ట్రయల్ కోర్టు ద్వారా నేర్చుకోవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ అవదేశ్ నారాయణ్ సంఘీ, ప్రసన్న స్వామినాథన్, శరత్ చంద్ర, ప్రశాంత్ కుమార్, డిఎస్ఎల్ఐసి ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్, కన్వీనర్ డాక్టర్ నందిని సిపి, పిబిసి ఛైర్‌పర్సన్ బివిఎస్ సునీత, డాక్టర్ సిహెచ్ లక్ష్మి పాల్గొన్నారు.

చోడవరం టిక్కెట్‌పై పునరాలోచన చేయాలి

ప్రజాశక్తి చోడవరం : చోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ విషయమై టిడిపి అధిష్టానంతో పాటు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా పునరాలోచించాలని, జనసేనకు టికెట్ కేటాయించాలని జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి పివిఎస్ఎన్ రాజు అన్నారు. స్థానిక పార్టీ ఆఫీసు వద్ద శుక్రవారం జరిగిన సమావేశంలో రాజు మాట్లాడుతూ టికెట్ విషయంలో మార్పు లేకపోతే పవన్ కళ్యాణ్ ఆదేశాలు మేరకు టిడిపికి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అల్లం రామప్పరావు, గూనూరు మూలు నాయుడు, నరవ సరోజినీ, కర్రి రమేష్ పాల్గొన్నారు.

కార్యకర్తలతో చర్చించిన తరువాతే భవిష్యత్ నిర్ణయం

ప్రజాశక్తి -చోడవరం : కార్యకర్తలతో చర్చించిన తర్వాతే భవిష్యత్తు నిర్ణయం ప్రకటిస్తానని టిడిపి చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు ఆ పార్టీ అధినేత చంద్రబాబు వద్ద కరాఖండిగా చెప్పారు. చంద్రబాబు పిలుపు మేరకు శుక్రవారం ఆయన్ను తాతయ్యబాబు కలిశారు. నియోజకవర్గంలో టిడిపి బలోపేతానికి బాగా కృషి చేసినందుకు అభినందించి, పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని బాబు ఆదేశించారని తాతయ్యబాబు చెప్పారు. అయితే పార్టీ కార్యకర్తలు, బంధుమిత్రులు, అభిమానులతో చర్చించి నిర్ణయం వెల్లడిస్తానని చంద్రబాబుకు చెప్పినట్లు తాతయ్య బాబు వెల్లడించారు.

రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని మేడిచర్ల గ్రామంలో 16 మంది నిరుపేద లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను శుక్రవారం అందించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆదిరెడ్డి వెంకటరావు, బొడ్డు తాతయ్య బాబు, సచివాలయ కార్యదర్శి రాజు విఆర్వో జగదీష్ పాల్గొన్నారు.

సీట్లు కేటాయింపులో కాపులకు అన్యాయం

ప్రజాశక్తి- సీతమ్మధార : వచ్చే ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు కేటాయింపులో రాష్ట్రంలోని ప్రధాన రాజకీయపార్టీలు కాపు కులస్తులకు తీవ్ర అన్యాయం చేశాయని కాపు సేన గౌరవాధ్యక్షుడు బండారు నారాయణమూర్తి అన్నారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ విశాఖ మహానగరంలో ఉన్న సీట్లలో ఏ ఒక్క స్థానాన్ని కూడా వైసిపి, టిడిపి, జనసేన, బిజెపిలు కాపులకు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. విశాఖ ఉత్తరం, భీమిలి, చోడవరం, అనకాపల్లి, గాజువాక నియోజకవర్గాలకు కాపులకు కేటాయించాలని కోరారు. కాపులకు ప్రాధాన్యతనిచ్చిన వారికే వచ్చే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, రాధాకృష్ణ లంక భాస్కర్ సురేష్ పాల్గొన్నారు.

నేటి న్యాయసాధన సభకు తరలిరండి

ప్రజాశక్తి -పిఎం పాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ, ఎపికి ప్రత్యేకహోదా ఎజెండాగా కాంగ్రెస్ పార్టీ ఈనెల 16న మధ్యాహ్నం 3గంటలకు ఉక్కునగరం తృష్ణ మైదానంలో నిర్వహించే న్యాయసాధన సభకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని భీమిలి కాంగ్రెస్ నేత గరే వెంకటరమణ పిలుపునిచ్చారు. తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిలారెడ్డి, ఎఐసిసి జనరల్ సెక్రటరీ మాణిక్యం ఠాకూర్; రఘువీరారెడ్డి, గిడుగురుద్రరాజు వంటి కాంగ్రెస్ ముఖ్యనేతలు సభలో పాల్గొని, ఆయా అంశాలను మేనిఫెస్టోలో పెట్టి, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలుపై ప్రజలకు స్పష్టతనిస్తారన్నారు. భీమిలి నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున కాంగ్రెస్ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు..

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో శ్రీరామచంద్ర మూర్తి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి హైస్కూల్‌లో 26 మంది టెన్త్ విద్యార్థులకు స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్ష సామగ్రి అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి తన సొంత నిధులతో వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో హెచ్ఎం సిహెచ్ సింహాచలం, ఉపాధ్యాయులు నయీమ్, సుజాతకుమారి, ఎ శ్రీనివాసరావు, రామకృష్ణ, ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్.కృష్ణారావు, గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు పాల్గొన్నారు

అట్టలు, పెన్నుల పంపిణీ

దుంబ్రిగుడ: మండలంలోని కించమండ ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న గిరి విద్యార్థులకు స్థానిక బిజెపి మండల అధ్యక్షుడు కిరసాని రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచితంగా అట్టలు, పెన్నులు పంపిణి చేశారు. కొత్తపల్లి గీత ఆర్థిక సహకారంతో 50 మంది విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగిందని అధ్యక్షుడు రమేష్ చెప్పారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి యువజన మోర్చా అధ్యక్షుడు బోయిన విశ్వనాథం, మహేంద్ర, ఉపాధ్యక్షుడు భీమరాజు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : పౌష్టికాహార పక్షోత్సవాల్లో అంగన్వాడీ, ఆశాకార్యకర్తల ఆధ్వర్యంలో శుక్రవారం బాలాజీనగర్ యుపిహెచ్‌సిలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. సెంట్రల్ ఫుడ్ సేఫ్టీ అధికారిణి ఐశ్వర్య, టెక్నికల్ ఆఫీసర్ దుర్గాదేవి, డాక్టర్ కిరణ్, లలిత దేవి, సిడిపిఒ రమణికుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, ఇతర ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తక్కువ బరువున్న పిల్లలు, రక్తహీనతతో బాధపడుతున్న వారు చిరుధాన్యాలు, ఆకుకూరలు, ఐరన్, ప్రొటీన్ పుష్కలంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విన్నీసా, సెల్వరాజ్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

- వడ్లపూడి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి దుస్థితిపై టిడిపి నేతల నిరసన
- రోడ్డును తవ్వి వదిలేసిన అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

తవ్వి వదిలేసిన రోడ్డును పరిశీలిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -గాజువాక : ప్రధాన జాతీయరహదారిలో వడ్లపూడి వద్ద రైల్వే బ్రిడ్జిపై రోడ్డు అధ్వానస్థితిపై టిడిపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ బ్రిడ్జిపై బైక్ ప్రమాదంలో టిడిపి నేత ముచ్చు అప్పలరాజు తీవ్రగాయాల పాలై గాజువాకలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో టిడిపి నేతలు రోడ్డు దుస్థితి పరిశీలించారు. ఈసందర్భంగ అగనంపూడి టిడిపి ముఖ్యనేత బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, రైల్వేఫ్లైఓవర్ వద్ద ఇప్పటికే గోతులమయమై అధ్వానంగా ఉన్న రోడ్డును వారం రోజుల క్రితం రాత్రి వేళ ప్రొక్లెయినర్‌తో తవ్వి మరింత గోతులమయంగా మార్చేశారని, దీంతో ఈ మార్గంలో ప్రయాణమంటే ప్రాణాలను అరిచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందన్నారు. సరిగా రైల్వేలైన్‌పైనే బ్రిడ్జిపై రోడ్డును ఎందుకు తవ్వి వదిలేశారో తెలియడం లేదన్నారు. గడువు దాటినా పాతికేళ్లకుపైగా అగనంపూడి టోల్‌గేట్ వద్ద రోజుకు కనీసం రూ.20లక్షలు చొప్పున టోల్ వసూళ్లను చేపడుతున్న జాతీయరహదారి అధికారులు, అధ్వానరోడ్లను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రమాదాలు జరిగి, ప్రజల ప్రాణాలు పోతున్నా అధికారులకు పట్టకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే వడ్లపూడి రైల్వే ఫ్లైఓవర్‌పై ఇరువైపులా రోడ్డుకు తక్షణ మరమ్మతులు లేదంటే పునర్నిర్మాణం చేపట్టి, గోతులను పూడ్చాలని డిమాండ్ చేశారు. టిడిపి నేతలు నెల్లి శ్రీనివాసరావు, కసిపల్లి శ్రీనివాసరావు, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షులు కొర్రయ్య జగదీష్ పాల్గొన్నారు..

ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార: జివిఎంసి 24వ వార్డు పరిధిలోని 815 మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను స్థానిక కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు అందజేశారు. శుక్రవారం రేసపువానిపాలెం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కెకె.రాజు మాట్లాడుతూ, పేదోడి సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌దేనన్నారు కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు జివి.రమణి పాల్గొన్నారు.

47వ వార్డులో 358మంది లబ్ధిదారులకు స్థానిక కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు వసంతల అప్పారావు, సుకుమార్, కె విజయ్, రాఘవలు,గురువోజీ, కృపా, జాయ్ లక్ష్మణ్, నర్సింగ్, సురేష్, చందు, భోగి జయకుమార్, రమేష్, నాగేశ్వరావు, గంగరాజు, భరత్‌వల్లి, కె.సాయి, తారాకేష్, రవి, అల్లజగ్గీ సురేష్ పాల్గొన్నారు.

26వవార్డులో జగ్గారావు బ్రిడ్జి సచివాలయం వద్ద వార్డు వైసిపి అధ్యక్షురాలు పీలా వెంకటలక్ష్మి లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నేతలు బొడ్డేటి కిరణ్ కుమార్, హరికృష్ణ, శ్యామల, పాండవ శ్రీనివాస రావు, రవి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి డెస్క్:గొలుగొండ మండలం లోని చీడిగుమ్మల పంచాయతీలో శుక్రవారం జగనన్న ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు మాట్లాడుతూ, పేదల సొంతింటి కల వైసీపీ ప్రభుత్వ హయాంలోనే నెరవేరిందన్నారు. అర్హులైన పేదవారికి ఇళ్ల స్థలాలు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాపారపు చినబ్బాయి, ఉప సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరాలను వినియోగించుకోండి : డిఎంహెచ్ఒ

మందులు అందజేస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి -ఆనందపురం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలంతా ఉపయోగించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని గొట్టిపల్లిలో నిర్వహిస్తున్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పెషలిస్ట్ వైద్యసేవలు గ్రామాల్లో ప్రజలకు చేరువ చేయాలన్నా సంకల్పంతో ప్రభుత్వం ఈ శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. వైద్యశిబిరాల్లో గుర్తించిన రోగులకు మెరుగైన సేవలు అవసరమైతే ప్రయివేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించే చర్యలు చేపడతామన్నారు. వైద్యశిబిరంలో సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గొట్టిపల్లిలో 324 మందికి వైద్య సేవలు అందించారు.. కార్యక్రమంలో ఆరోగ్య సురక్ష జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి. ఉమాపతి, సర్పంచ్ గంటా జగదీశ్వరరావు, వైసిపి నేతలు ఇ.వెంకటరావు (జగన్), ఆనందపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ గంగునాయుడు, సిహెచ్ఒ సాంబమూర్తి, హెచ్ఎస్ పార్వతమ్మ పాల్గొన్నారు.

అనకాపల్లి డెస్క్:ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని గొలుగొండ ఎంపీపీ గజ్జలపు మణికుమారి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు, ఏఎల్ పురం సర్పంచ్ లోచల సుజాత సూచించారు. శుక్రవారం ఏఎల్ పురం ఎంపీయుపి పాఠశాలలో జగనన్న సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదవాడికి నాణ్యమైన వైద్యం అందాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చింతల బుల్లిప్రసాద్, బూత్ కన్వీనర్ అవినాష్ పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశానికి

11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో వచ్చే విద్యాసంవత్సరంలో 6,7,8,9 తరగతులతోపాటు ఇంటర్ ఎంపిసి గ్రూపులో ప్రవేశాలకు ఈ నెల 12 నుండి వచ్చేనెల 11 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నట్లు కెజిబివి ప్రత్యేకాధికారి కె.గ్రేస్‌లిల్లీ తెలిపారు. అనాథలు, డ్రాపౌట్స్, పేద ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, బిపిఎల్‌కు చెందిన బాలికలకు అడ్మిషన్లలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. పూర్తి వివరాలను పాఠశాల నోటీస్‌బోర్డులో పెట్టినామన్నారు. ఫోను ద్వారా సమాచారానికి టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 8599కు సంప్రదించవచ్చున్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థినుల తల్లిదండ్రులకు ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతంలో రూ.1.20లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.1.40లక్షలకు మించకూడదన్నారు. ప్రవేశార్హత పొందిన బాలికలకు అన్ని ప్రభుత్వ విద్యాపథకాలు వర్తిస్తాయన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఫకీరప్ప, మణికంఠ

ప్రజాశక్తి - పెందుర్తి : అభివృద్ధి చెందుతున్న సాంకేతిక మాటున సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు సైతం అదేస్థాయిలో పెరిగి పోతున్నాయని, వాటిపై అప్రమత్తంగా ఉండాలని జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప అన్నారు. అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అసోసియేషన్ (ఆసరా) ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులు, చట్టాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆసరా ప్రతినిధులతో కలిసి జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప, డిసిపి విఎస్.మణికంఠ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫకీరప్ప మాట్లాడుతూ ఆసరా అవగాహన కార్యక్రమాలను అభినందించారు. ఆసరా అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఇ.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, తమ అసోసియేషన్ సామాజిక బాధ్యతలో భాగంగా వినియోగదారుల హక్కులపై అవగాహనకు అనే కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఆసరా సభ్యులు పాల్గొన్నారు

విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం

విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు కాపులుప్పాడలో రూ.8 కోట్లతో నిర్మించిన 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, ఎపిఇపిడిసిఎల్ విశాఖ ఎస్ఇ ఎల్.మహీంద్రనాథ్, జోన్ 3, ఇఇ పోలాకి శ్రీనివాసరావు, డిఇఇ రొంగలి రమేష్, భీమిలి, చిట్టివలస ఎఇఇలు శేకరయ్య, బి రవి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 45వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో రూ.1.80కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు స్థానిక వార్డు కార్పొరేటర్ కంపా హనోక్‌తో కలిసి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. నియోజకవర్గ పరిధిలోని మూడు సచివాలయాల్లో రూ.వంద కోట్ల సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం అందజేసిందన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు పైడి రమణ, జివిఎంసి అధికారులు, కార్యకర్తలు రాజుయాదవ్, బాబురావు, సత్యానందరెడ్డి, నూకరత్నం, మాత ఈశ్వర్, రవిశంకర్, ఎల్లాజీ, కనకరాజు, సన్నీ పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE
II ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.P. 22/2024

Between:
Sri Raparthi Appa Rao, S/o. Moolayya, Hindu, aged 64 years, R/at D.No: 4-8/2, Nagendra Colony, Gopalapatnam, Visakhapatnam - 530027 ...Petitioner
And
1) **Akkireddy Nageswara Rao**, S/o late Adinaidu, Hindu, aged about 40 years, R/at D.No.1-18, Near Ramalayam, Kothapalem,Gopalapatnam, Visakhapatnam-27.
2) **Akkireddy Rajesh**, S/o. Sanyasi Rao, Hindu, aged about 45 years, R/at Kanakadurga Welding Shop, Narava Road, Kothapalem, Gopalapatnam, Visakhapatnam-27
3) **Meesala Narasimhalu**, S/o. Late Ramu Hindu, age about 49 years, Near MES Pump House, Narava Road, Kothapalem, Gopalapatnam, Visakhapatnam-530027
4) **Suddamalla Atchibabu**, S/o. Late Sathayya, Hindu, age about 58 years R/A Secretary Department, A.O.B. Building, Chainman Phase, Visakhapatnam Port trust, Visakhapatnam-27
5) **Raghupathruni Srinivasa Rao**, M/o. Kamala, Hindu, aged about 45 years, R/at D.No.4-18, Nagendhra Colony, Kothapalem,Gopalapatnam, Visakhapatnam-530027.
6) **Kanaparthi Ramudu**, S/o. Late Chinnarao, Hindu, age about 45 years, R/at Nagendhra Colony, Kothapalem, Gopalpatnam, Visakhapatnam- 530027
7) **Mummana Raju**, S/o. Ramunaidu, Hindu, age about 48 years, R/at Santhoshinagar, Kothapalem,Near Retired Judge House, Gopalpatnam, Visakhapatnam-530027
8) **Kanaparthi Sattibabu**, S/o. Apparao, Hindu, age 40 years, Kothapalem, Nagendra Colony, Gopalpatnam, Visakhapatnam
9) **Pinisetty Lakshmi**, S/o. Ramarao, Hindu, age about 53 years, R/at Kothapalem Nagendra Colony, Sachivalayam Street, Gopalpatnam, Visakhapatnam-530027
10) **Akkireddy Pentayya**, S/o. Apparao, Hindu, age about 55 years, R/at D.No.4-54, Nagendra Colony, Kothapalem, Gopalpatnam, Visakhapatnam-530027.
11) **Naani & S.Krishna**, C/o. Kanaparthi Sattbabu, S/o. Apparao, Hindu, age about 40 years, R/at Nagendra Colony, Kothapalem, Gopalpatnam, Visakhapatnam-530027
12) **Smt., M. Triveni**, W/o. late Balaraju Hindu, age 40 years, D.No.2-113, Kothapalem, Gopalpatnam, Visakhapatnam-27
13) **Maaturi Ramakrishna**, S/o. Pydiyya (Late), Hindu, age about 42 years, R/at D.No. 4-62, Kothapalem, Nagendra Colony, Gopalpatnam, Visakhapatnam-530027.
14) **Saanapati Pydikonda**, S/o. late Appalanaidu, Hindu, age about 44 years, C/o. A. Chella Rao, S/o. Ramana, #4-56, Kothapalem, Nagendra Colony, Gopalpatnam, Visakhapatnam
15) **K.Triveni**, W/o. Sattibabu, Hindu, age about 56 years R/at D.No.2-67, Gopalpatnam, Visakhapatnam-530027.
16) **Reddipalli Venkatarao**, S/o. Ananda Rao, Hindu, age 44 years, #18-40/14, Chandranagar,Gopalpatnam, Visakhapatnam
17) **Smt. Gudla Punyavathi**, W/o. Prasad, Hindu, age 43 yrs, R/at Sreenivasa Nagar,near Pydimamba Temple,Visakhapatnam
18) **Kothakota Lakshmi**, W/o Appalanaidu, Hindu, age 50 yrs R/at Nagendra Colony, Kothapalem, Gopalpatnam,Visakhapatnam
19) **Kanaparthi Suribabu**, S/o. late Atchanna, Hindu, age about 56 years, R/at. Sadarampattu Veedhi, Kothapalem, Gopalpatnam, Visakhapatnam-27.
20) **Sarveswara Rao**, S/o. Venkata Rao, Hindu, age about 60 years, Rest-do-
21) **Smt., Koilada Priyanka**, W/o. Santosh Kumar, Hindu, age about 33 years R/at Near Nookambika Temple, Anakapalli.
22) **Mohana Rao**, S/o. Appala Swamy, Hindu, age 36 years, R/at Hanuman Junction, Rachchabandi Vaari Illu, Kothapalem, Nagendra Colony, Gopalpatnam, Visakhapatnam-530027
23) **Smt. N. Usha**, W/o. Venkata Rao, Hindu, age 62 yrs, R/at Nagendra Colony, Santoshinagar, Gopalpatnam,Visakhapatnam
24) **Smt. D.Suneetha**, W/o Atchumnaidu, Hindu, age about 55 years, R/at Muralinagar, Visakhapatnam-27.
25) **G. Suresh**, S/o. Kanakaraju, Hindu, age 30 years, R/at Kothapalem, Gopalpatnam, Visakhapatnam-27
26) **P.Appala Swamy**, S/o. late Kanna Rao, Hindu, aged about 30 years, R/at Near Ramalayam, Kothapalem, Gopalapatnam, Visakhapatnam-27
27) **Smt. Mamidi Ramanamma**, W/o Ramana, Hindu, aged about 55 years, R/at Ramalayam Veedhi, Vepagunta, Pendurthy, Visakhapatnam-27
28) **Setti Parwathi**, W/o. late Raju, Hindu, aged 45 years, R/at # 4-10, Nagendhra Colony, Gopalapatnam, Visakhapatnam
29) **V. Anand**, S/o. Ramarao, Hindu, aged 44 years, R/at Nagendhra Colony, Kothapalem, Gopalapatnam, Visakhapatnam
30) **G. Somulamma**, W/o. late Nooka Raju, Hindu, aged 52 years, R/at Santhoshinagar, Gopalapatnam, Visakhapatnam.
31) **Thandrangi Srinu**, S/o. Gurunadha Rao, Hindu, aged about 39 years, R/at D.No.4-10, Nagendhra Colony, Gopalapatnam, Visakhapatnam-27. ...Respondents

NOTICE

Please take Notice that the above named petitioner is filed the above case against all of you for declaration of Insolvent Person and the above matter is stands posted to **01-04-2024**, for appearance on that day all of you are personally or through your Advocates attend before the Hon'ble Court failing which the Hon'ble Court was decided under Court of Law.

(by Order of the Hon'ble II Addl. Senior Civil Judge at Visakhapatnam)
M.R.K. APPA RAO, MALLA ANUSHA & K. PRATHYUSHA, Advocates
Visakhapatnam-29. Cell: 9440330968, 9966740259

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలి

ప్రచారం చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద ప్రచారం నిర్వహించారు. స్థానిక డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను చేరాలని మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాల, వడ్డాది జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాల వద్ద డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ప్రచారం నిర్వహించారు. డిగ్రీ కళాశాలలో కోర్సులు, సైన్సు, కంప్యూటర్ ల్యాబ్, వసతి, సౌకర్యాలపై వివరించారు. ప్రభుత్వం ఇచ్చే స్కాలర్షిప్ తో పాటు రిలయన్స్, సృజన వాణి, సంతూర్ స్కాలర్షిప్ లు కూడా సాధించిన విద్యార్థులతో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.జయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న నాయకులు

టిడిపి పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి -నక్కపల్లి:పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. మండలంలోని అమలాపురం పంచాయతీ పాటిమీద గ్రామంలోని లింగాల చెరువు వద్ద ఉపాధి కూలీలకు పథకాలపై అవగాహన కల్పించారు.సంక్షేమ పథకాలపై సి, ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష రూపాయల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: మాకవరపాలెం మండలంలోని సీతన్న అగ్రహారం గ్రామానికి చెందిన పల్లా కొండబాబుకి బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా అనారోగ్యం పాలయ్యాడు. దీంతో నర్సీపట్నం టీడీపీ మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ సొంత నిధులు లక్ష రూపాయలు పల్లా కొండబాబు కుటుంబానికి శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు ఆర్‌వై.పాత్రుడు, శెట్టిపాలెం సర్పంచి రామునాయుడు, గంగవరం మాజీ సర్పంచ్ రమణ పాల్గొన్నారు.

చెక్కును ఇస్తున్న రాజేష్

ప్రచారం చేపడుతున్న అధికారులు

ఇవిఎంలపై అవగాహన

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్ద ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా తహసిల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ సూచనలు పాటించి ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప తహసిల్దార్ అన్నాజీరావు, ఆర్ఐ ఉర్ధవరావు పాల్గొన్నారు.

IN THE HONOURABL COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
E.P. 14/2017 in O.S. 169/2015

Between: **Mamidi Yasodha and others** ---Petitioners/Dhr
And: **Sangam Dorababu** ---JDr
To,
Sangam Dorababu, S/o Venkata Rao, Working as a teacher, GVMC Primary School, Tarakarama nagar, Visakhapatnam, Dr.No 39-26-80, Punjob Hotel Juncation, Visakhapatnam.

పిటిషనర్ పై నెంబరు అమలు పిటిషన్ దాఖలు చేయువున్నారు. సదరు పిటిషన్‌లో కోర్టు వారి అర్డర్ ప్రరారం మీ జీతం జప్తు చేయడము అయినది. సదరు జప్తు ప్రకారం నేటి వరకు మీ జీతం నుండి రికవరీ రూ౹౹ 3,25,337/- చేయడం అయినది. సదరు అమౌంట్ నిమిత్తం పిటిషినర్‌లు పై కోర్టులో చెక్ పిటిషన్ ఫైల్ చేయడమైనది. ఆ సదరు పిటిషన్‌లో మీరు రెస్పాడేంట్ అయినందున పై కోర్టు వారు **మీ యొక్క హాజరు నిమిత్తం తే 28-03-2024 దిన శ్రీకాకుళం కోర్టువారు పై నెంబర్ కేసును వాయిదా వేసియున్నారు.** పై కోర్టు వారు ఎదుట మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసికోవలెయును. లేని యడల మీ పరోక్షముగా తీర్మానించడమగునని ఇందు మూలంగా తెలియపరచడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం //

పైడి అనంతరావు
వాది తరుపు న్యాయవాది,
శ్రీకాకుళం, ఫోన్: 9346034649.

పబ్లిక్ నోటీస్

మా క్లయింట్లు అయిన విశాఖపట్టణం జిల్లా, చెంగళరావుపేట, విశాఖపట్నం వాస్తవ్యులు అయిన (1) లేటు బెసిట్టి రామయ్యగారి కుమారుడు బెసిట్టి నాగభూషణ్ (2) కరుటూరి లక్ష్మినారాయణగారి కుమారుడు కరుటూరి అనుదీప్ ఇరువురు ఏకస్తులై మాకిచ్చిన సంజాయిషీ పై యావన్మందికీ తెలియజేయునది ఏమనగా

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి ప్రస్తుత హక్కుదార్లు అయిన విశాఖపట్నం జిల్లా, కంచరవీధి, డో.నెం. 22-27-3రు, విశాఖపట్టణం కాపురస్తులు అయిన (1) లేటు జనపరెడ్డి రామారావు గారి కుమారుడు జనపరెడ్డి శ్యాంబాబు (2) జనపరెడ్డి శ్యాంబాబు గారి భార్య జనపరెడ్డి కృష్ణకుమారి గార్ల వద్ద నుండి మా క్లయింట్లు క్రయపర్చుటకు ఒప్పందం కుదుర్చుకుని తేది:11-03-2024న క్రయ అగ్రిమెంటు వ్రాయించుకొనియున్నారు. షెడ్యూలు దాఖలా ఆస్థి వంశ పారంపర్య ఆస్థియై నేటి వరకు వారి స్వాధీనములో గలదినన్న, సదరు ప్రస్తుతం హక్కుదార్ల నుండి మా క్లయింట్లు క్రయవిషయంలో ఎవ్వరికైనా ఎటువంటి ఆక్షేపణలు కానీ, తనఖాలు కానీ, హక్కులు కానీ, ఇతర ప్రతిబంధకములు ఏమైనా ఉన్న యెడల మా క్లయింట్లుకు గానీ మాకు గానీ ఈ రోజు నుండి వారం రోజులలో ఆధార పూర్వకముగా, లిఖిత పూర్వకముగా తెలియజేయవలెను. ఎటువంటి ఆక్షేపణలు రానియెడల షెడ్యూలు ఆస్థిని నిర్వివాద నిష్పేచి ఆస్థిగా భావించి, మాక్లయింట్లు క్రయము పొందెదరు. పిదప వచ్చు ఆక్షేపణలు మా క్లయింట్లును బైండు చేయవు.

క్రయ ఆస్థి షెడ్యూలు

విశాఖపట్నం జిల్లా, విశాఖపట్నం జాయింటు సబ్ రిజిస్ట్రారు ఆఫీసు పరిధిలోని, గ్రేటర్ విశాఖపట్నం నగరపాలక సంస్థ ఏరియాలో చేరిన శ్రీ సీతారామస్వామి టెండపుల్ వార్డు, బ్లాకు నెం.6 టౌన్ సర్వేనెం. 904 చేరినటువంటి 164.38 చ౹౹గ౹౹లు స్థలములో అందరి డో.నెం. 22-27-3 మునిసిపల్ అసెస్‌మెంట్‌నెం. 1086170454 మరియు మూడు కరెంటు సర్వీసు కనెక్షన్‌లు, ఒక మంచినీటి కుళాయి కనెక్షను కలిగిన బంగాళ పెంకుల ఇంటికి హద్దులు:
తూర్పు : ధనలక్ష్మిగారి యిల్లు,
దక్షిణము : డో.నెం. 22-39-11 గల ఇల్లు
పడమర : రోడ్డు
ఉత్తరము : రోడ్డు

గుమ్మడపు సత్యనారాయణమూర్తి
సింధూరి పరవాడ, న్యాయవాదులు,
డో.నెం. 30-12-1, రంగాస్ట్రీట్,
దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020
విశాఖపట్నం
తే:15-3-2024
సెల్: 9182632466, 8247411845

IN THE HONOURABLE COURT OF THE CHIEF METROPOLITAN MAGISTRATE AT VISAKHAPATNAM
C.C 1603/2023

Between:
Pediredla Atchibabu, S/o Late Kannayya, aged 48 years, residing at D.No.26-14-155, Opp: BSNL Office, Velampeta, Visakhapatnam-530001 . . . Complainant
And:
Doddi Jagan Srinivas, S/o Apparao, aged 33 years, C/o C.S Rao, D.No.22-18-6, Bondavari Street, Kanchara Street, Visakhapatnam- 530001 . . . Accused
To
Doddi Jagan Srinivas, S/o Apparao, Hindu, aged 33 years, C/o C.S Rao, D.No.22-18-6, Bondavari Street, Kanchara Street, Visakhapatnam- 530001

SUMMONS TO THE ACCUSED

That you are the accused in the above numbered complaint and the above named Complainant initiated the said proceedings against you for the offences punishable U/Sec 138 & 142 of N.I Act and the said matter is stands posted to 03-04-2024 for your appearance and as such you are hereby directed by the Hon'ble Court through this publication to appear before the Hon'ble Court on 03-04-2024 at 10:30 AM either in person or through an advocate duly authorized by you and answer all the claims failing which the matter will be decided in your absence as per law.
(By order of the Hon'ble Court)

N.CHITTI BABU
Advocate
D.No.40-2-81, Santhi Nagar,
Kailsapuram Road,
Visakhapatnam-24
Visakhapatnam,
Date: 15-03-2024
Cell No.9441019339

మాజీ మంత్రిని కలిసిన పైలా


స్వీటు తినిపిస్తున్న రెడ్డి సత్యనారాయణ

ప్రజాశక్తి-చీడికాడ:పార్టీ మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే రెడ్డి సత్యనారాయణను శుక్రవారం పెదగోగాడ గ్రామంలో మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో గెలుపునకు సంబంధించి సలహాలను, సూచనలను పైలా అడిగి తెలుసుకున్నారు. పైలా ప్రసాదరావు వెంట తెలుగుదేశం కార్యకర్తలు ఉన్నారు.

పలు గ్రామాల్లో ఆలయాలకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలోని రామచంద్రపాలెం గ్రామంలో పరదేశమ్మ ఆలయం శంకుస్థాపన చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు 10 లక్షలతో ఆలయం నిర్మిస్తున్నట్లు వైసిపి గ్రామ కన్వీనర్ లాలం మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైసీపీ నాయకులు తమరాన కన్నబాబు పాల్గొన్నారు.

అనకాపల్లి డెస్క్:గొలుగొండ మండలంలోని పుత్తడి గైరంపేట గ్రామంలో శుక్రవారం ఆంజనేయస్వామి గుడి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పత్తి రమణ మాట్లాడుతూ 10లక్షల టీటీడీ నిధులు మంజూరు కావడంతో ఈ ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు.

మండలంలోని ఏఎల్ పురంలో భక్త మార్కండేయ ఆలయ నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ ఆలయ నిర్మాణానికి టీటీడీ రూ.10లక్షలు మంజూరు చేసింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుండల చినతల్లి, ఎంపిటిసి మామిడి కృష్ణ, బుల్లిప్రసాద్, పద్మశాలి సేవా సంక్షేమ సంఘ సభ్యులు సుదా వరహలరావు, అనందరావు తదరతరులు పాల్గొన్నారు.

క్రాష్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపిడిఒ

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

ప్రజాశక్తి -కోటవురట్ల:రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటికి ఇబ్బంది లేకుండా మండల వ్యాప్తంగా క్రాస్ ప్రోగ్రాం ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు తెలిపారు. శుక్రవారం ఎంపీపీ అప్పలనాయుడు క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, మండలంలో చేతి పంపులకు మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. మండల వాసులు ఎక్కడైనా సమస్యలు ఎదురైతే ఆయా సచివాలయాలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఇంజనీర్ మహేష్, ఏవో చంద్రశేఖర్, ఏపీఎం రమణకుమారి పాల్గొన్నారు.

ఆలయ చైర్‌పర్సన్‌గా అమరేశ్వరి

ప్రజాశక్తి పాయకరావుపేట:పట్టణంలోని పాండురంగ స్వామి దేవస్థానం నూతన చైర్‌పర్సన్‌గా దగ్గుపల్లి సాయిబాబా అమరేశ్వరి ప్రభుత్వం నియమించింది అమరేశ్వరి భర్త దగ్గుపల్లి సాయిబాబా గతంలో పాండురంగ స్వామి దేవస్థానం పనిచేసినారు సాయిబాబా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పలు అభివద్ధి కార్యక్రమాలు చేపట్టారు సాయిబాబా ప్రస్తుతం అనకాపల్లి జిల్లా ప్రచార పబ్లిక్ వింగ్ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు బోర్డు డైరెక్టర్గా మజ్జి అచ్చియ్య మ్మ, రామాల శ్రీను, అల్లంకి వెంకటలక్ష్మి, చిక్కాల బాబు రామలక్ష్మి, తూములూరి పరమేశ్వరి, లావేటి సన్యాసిరావు, తలారి సుబ్బరాజు, జగతా కుమారస్వామి, ఈ కష్ణ స్వాములను, ప్రభుత్వం నియమించింది నూతనంగా నియమితులైన బోర్డు కమిటీ సభ్యులతో దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరాజు, ఈవో వెంకట్రాది ప్రమాణ స్వీకారం చేయించారు, ఈ సందర్భంగా దగ్గపల్లి సాయిబాబా అమరేశ్వరి మాట్లాడుతూ దేవస్థాన అభివద్ధి కొరకు సిద్ధ శుద్ధితో పనిచేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - మాడుగుల:. చింతలూరులో ఏడువాక గంగరాజు ఆధ్వర్యంలో వైసీపీ రెబెల్ సర్పంచ్ అభ్యర్థి పతివాడ వరహాల నాయుడు, మాజీ కోఆపరేటివ్ డైరెక్టర్ కొమర చిన్న అబ్బాయి, కాళింగి రాము, సత్తిబాబు, శ్రీను పైలా ప్రసాదరావు కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు.

పాఠశాలలో 'లిప్' బృందం తనిఖీలు

విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న బృందం సభ్యులు

ప్రజాశక్తి- నక్కపల్లి : స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను ప్రధానోపాధ్యాయులు వేమగిరి సూకరాజు ఆధ్వర్యంలో లిప్ పరిశీలనా బృందం శుక్రవారం పరిశీలించింది. సబ్జెక్ట్ నిపుణులు ఉపాధ్యాయుల బోధనా సాధనా పిల్లలకు ఎలా బోధిస్తున్నారో పరిశీలించారు. దీనికి సంబంధించిన వివిధ రికార్డులను పరిశీలించారు. ప్రాథమిక పరీక్షల నిర్వహించిన అనంతరం ఇప్పటివరకూ విద్యార్థులు సాధించిన ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సలీమా, నాగలక్ష్మి, సబ్జెక్ట్ రిసోర్స్ పర్సన్ లు రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

ఉద్యోగ నైపుణ్యతపై అవగాహన

ప్రొఫెసర్ గుప్తను సత్కరిస్తున్న సాంకేతిక కాలేజీ యాజమాన్యం

ప్రజాశక్తి -పిఎం.పాలెం: స్థానిక సాంకేతిక విద్యాపరిషత్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ డెవలప్‌మెంట్ సెల్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం ఎంప్లాయి ఎబిలిటీ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. ఎయు విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ బివిఆర్.గుప్త రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించి, ఉద్యోగ నైపుణ్యతపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సెక్రటరీ డాక్టర్ ఎస్ వి.రాజేంద్ర, ఇడి ఎస్.రాహుల్ ఆలూర్‌దాస్, ఇఇ మధుబాబ్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జెఆనంద్ చందూలాల్, ఎఒ ఎ.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ఎస్ అనిల్, ప్రొఫెసర్ హరిబాబు, ప్రొఫెసర్ రమణమూర్తి, మెకానికల్ విభాగాధిపతి ఎం.పద్మనాభం, మెకానికల్ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ విద్యార్థులకు హాల్ టిక్కెట్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : చిప్పాడ దివిస్ సంస్థ వారు తీసుకుని పరీక్ష ఫీజు చెల్లించిన15 మంది టెన్త్,18 మంది ఇంటర్ ఓపెన్ స్కూల్ విద్యార్థులకు శుక్రవారం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హాల్ టిక్కెట్లు అందజేశారు.

భీమిలి మండలం చిప్పాడ, అన్నవరం, పెద నాగమయ్య పాలెం పంచాయతీల్లో చదువకు దూరమై డ్రాపౌట్‌గా ఉన్న విద్యార్థులను గుర్తించి, వారికి ఓపెన్‌స్కూల్‌లో పరీక్షలు రాసేట్లుగా ప్రోత్సహించిన చిప్పాడ దివిస్ సంస్థ, వారికి పరీక్ష ఫీజు కింద రూ.రూ 28 వేలు చెల్లించినట్లు సంస్థ సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సిఎస్ఆర్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, కె.నరసింహ పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- రోలుగుంట : కొత్తకోట సీఐ ఎల్.అప్పల నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం రోలుగుంట గ్రామంలో 50 మంది పోలీసులతో కవాతు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమైన ఈ కవాతు మెయిన్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు నిర్భయంగా ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రోలుగుంట ఎస్సై సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

మాట్లాడుతున్న శంకర్‌నాయక్

ప్రజాశక్తి-అనకాపల్లి: గిరిజన సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన తన రెండురోజుల పర్యటన వివరాలు తెలియజేశారు. వి.మాడుగులలో వసతి గృహాలకు శాశ్వత భవనాలు మంజూరు, వడ్డాదిలో బాలుర, బాలికల కళాశాల సంక్షేమ వసతి గృహాలు ఏర్పాటు చేయవలసిందిగా కోరుతూ విద్యార్థులు వినతిపత్రం సమర్పించినట్లు వెల్లడించారు. రోలుగుంట మండలం అర్ల, లోసింగి, రావికమతం మండలంలో చలిసింగం గ్రామాలను శాసనసభ్యులు కరణం దర్మశ్రీతో కలిసి సందర్శించి, సమస్యల పరిష్కారానికి ఆదేశించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ రైట్స్ ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్‌వి దొర, గిరిజన విద్యార్థి సమాఖ్య ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు యు.భానుచందర్, ట్రైబల్ రైట్స్ ఫోరమ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.పూర్ణరావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి అజయ్ బాబు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నాగ శిరీష పాల్గొన్నారు.

జీడి పిక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

వ్యకాస ఆధ్వర్యాన నిరసన తెలియజేస్తున్న జీడి రైతులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : జీడీ పిక్కలకు గిట్టుబాటు ధర ప్రకటించి, ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. మండలంలోని వాలాబు పంచాయతీలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిటి.దొర అధ్యక్షతన శుక్రవారం జీడీ రైతులు సదస్సు జరిగింది. అనంతరం తమ డిమాండ్లపై రైతులు నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా వెంకన్న, శంకరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జీడి పంటకు మద్దతు ధర ప్రకటించకపోవడంతో, వ్యాపారులు తమకు ఇష్టమొచ్చిన ధరకు రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం జీడీ పిక్కలు 80 కేజీల బస్తాను వ్యాపారులు రూ.7వేలుకు కొనుగోలు చేస్తున్నారని, ఒక బస్తా జీడిపిక్కల నుండి 25 కేజీల పప్పు వస్తుందని, కేజీ పప్పు ధర రూ.800 చొప్పున, ఒక బస్తా పిక్కలకు రూ.20 వేలు వస్తుందని తెలిపారు. ఒక బస్తా పిక్కలు ప్రోసెసింగ్‌కి రూ.2వేలు ఖర్చు అవుతుందని, రైతులు కోరిన విధంగా బస్తా జీడిపిక్కల ధర రూ.16వేలు ప్రకటించినా ఇంకా వ్యాపారులకు రూ.2వేలు మిగులుతుందని పేర్కొన్నారు. దీంతో పాటు జీడి తొక్క, నూక, ఇతర ఉప ఉత్పత్తుల నుంచి కూడా వ్యాపారులు ఆదాయం పొందుతున్నారన్నారు. ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తే ఇటు రైతులకు, అటు వినియోగదారులకు లాభం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సిహెచ్.లక్ష్మణ, డి.శంకర్, బి నాగేశ్వరరావు, సోముల కృష్ణ, పి అప్పలరాజు, కె రాము, బి దేముడు, సిహెచ్ దేముడు, ఈశ్వరరావు, డి సోమయ్య, మామిడి దేముడు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన పొత్తుపై భిన్నాభిప్రాయాలు

ప్రజాశక్తి చోడవరం : టిడిపితో, జనసేన పార్టీ ఎన్నికల్లో కలిసి పని చేయడంపై చోడవరంలోలో శుక్రవారం నిర్వహించిన జనసేన సమావేశంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. చోడవరం టికెట్ జనసేనకు కేటాయిస్తారని ఆశగా ఎదురు చూసిన తమకు నిరాశ ఎదురైందని వాపోయారు. టిడిపితో కలిసి పనిచేయడమంటే కుదరని పని అని కొంతమంది మండల స్థాయి నాయకులు కరాఖండిగా చెప్పారు. టిడిపి అభ్యర్థి కెఎస్ఎన్ఎస్ రాజు ఎన్నికలైన తర్వాత తమకు ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వడన్నారు. ఐదేళ్లగా నియోజకవర్గం సమస్యలపై జనసేన పార్టీ పోరాడినా, కెఎస్ఎన్ఎస్.రాజు కనీసం తమతో కలిసి రాలేదని జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి పివిఎస్ఎన్ రాజు తెలిపారు. అటువంటి వ్యక్తితో ఎన్నికల్లో ఎలా కలిసి పని చేస్తామని ప్రశ్నించారు. టిడిపి, జనసేన స్టీరింగ్ కమిటీ నిర్ణయం ప్రకారం ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి లికిత పూర్వకంగా జనసేన రాసిస్తేనే మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. దీనిపై కొంతమంది కార్యకర్తలు సుముకుత వ్యక్తం చేయగా కొంతమంది పెదవిరించారు.

ఓటు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట మండలం తేగాడలో గ్రామ సంఘం, మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముందుగా ర్యాలీ చేసి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపిటిసి తుంపాల మంగతాయారు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, ఏపిఎం ఎస్.శ్రీనివాసరావు, సీసీ అనురాధ, విఓఏలు మంగలక్ష్మి, చినపాప పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

అధికారులతో మాట్లాడుతున్నఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్: ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూడాలని నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వి.జయరాం సూచించారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఎన్నికల ప్రక్రియపై సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న స్క్వాడ్ బృందాలు నిఘా పెంచాలని సూచించారు. ఎన్నికల కేంద్రాల వద్ద పరిస్థితిని సమీక్షించి కచ్చితమైన సమాచారాన్ని సెక్టార్ అధికారుల నుంచి సేకరించాలన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి -కోటవురట్ల : ఈనెల 18 నుంచి 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి రామారావు తెలిపారు. మండలంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మండల కేంద్రంలోని బాలికల పాఠశాల, ప్రభుత్వ పాఠశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. తెలుగు మీడియంలో 194, ఇంగ్లీష్ మీడియంలో 287, విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, వీరిలో బాలికలు 219, బాలురు 262 ఉన్నట్లు తెలిపారు. మండలవ్యాప్తంగా 412 మంది విద్యార్థులు మండలంలోని రెండు కేంద్రాలలో పరీక్షల్లో పరీక్షలు రాయనున్నారని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ప్రజాశక్తి -మాడుగుల: ద్విచక్ర వాహనం నుండి జారి లారీ కింద పడిన మహిళ మృతి చెందింది. మాడుగుల మండలం కేజే పురం జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు..ఎం.కోటపాడుకు చెందిన గొల్కొండ ఈశ్వరరావు తన భార్య సత్యవతితో ద్విచక్ర వాహనంపై గాజువాకలో బంధువుల ఇంటి నుండి స్వగ్రామం ఎం కోటపాడు వస్తున్నారు. ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం పై నుండి జారి పడిన మహిళ సిమెంట్ లోడ్ లారీ చక్రం కింద పడి మృతి చెందింది. భర్త ఈశ్వరరావుకు బలమైన గాయాలు తగలడంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. సత్యవతి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట :మండలంలోని వడ్డాది గ్రామ శివార్లలో పేకాట శిబిరంపై శుక్రవారం సాయంత్రం ఎస్సై డి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. నలుగురిని అరెస్ట్ చేసి వారి నుండి రూ.4,720 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి - చీడికాడ : నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసినట్లు చీడికాడ ఎస్సై నారాయణరావు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తమకు అందిన సమాచారం మేరకు చీడిపల్లి గ్రామ శివార్లలో తనిఖీ చేయగా నాటు సారా తయారీకి నిల్వ చేసిన సుమారు 800 లీటర్ల బెల్లం పులుపు గుర్తించి ధ్వంసం చేశామన్నారు.

అనకాపల్లి డెస్క్ : రావికమతం మండలంలో నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన పులుపును రావికమతం ఎస్ఐ ధనంజయనాయుడు సిబ్బందితో దాడి చేసి ధ్వసం చేశారు. మండలంలోని గుమ్మాలపాడు గ్రామంలో 3,400 లీటర్ల పులుపు ధ్వంసం చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గ్లకోమాపై అవగాహన ర్యాలీ

ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - సీతమ్మధార : ప్రపంచ గ్లకోమా అవగాహన వారోత్సవాలలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల వద్ద డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు ర్యాలీని ప్రారంభించగా, సత్యం జంక్షన్ మీదుగా రామా టాకీస్ వరకు సాగింది.అంతకుముందు కంటి ఆసుపత్రి ఆవరణలో వైద్య.విద్యార్థులు కన్ను ఆకృతిగా ఏర్పడి కూర్చున్నారు. ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ టి.జ్యోతిర్మయి, డాక్టర్ రమణ, డాక్టర్ ప్రేమలత, డాక్టర్ పద్మావతి, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ సౌజన్య, డాక్టర్ శ్రీలక్ష్మి, పిఎంఒలు ఉమా శ్రీనివాస్, సురేష్ సుబ్బలక్ష్మి, సుజాత, వైద్య విద్యార్థులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు

వైసిపి బిసి సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ప్రతాప్

సిఎం జగన్‌తో ప్రతాప్

ప్రజాశక్తి- మాధవధార: వైసిపి బిసి సెల్ రాష్ట్ర సంయుక్తకార్యదర్శిగా పైడిప్రతాప్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని అందుకున్నారు. పార్టీ అభివృద్ధికి పనిచేసిన కార్యకర్తలకు ఎపుడూ గుర్తింపు ఉంటుందన్నారు.. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పోర్టు ఛైర్మన్ అంగముత్తు

సుందరీకరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సి హార్స్ జంక్షన్ నుంచి విశాఖపట్నం పోర్టు పరిపాలనా భవనం వరకు సుందరీకరణ పనులను విశాఖ పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ప్రారంభించారు. అందుకోసం రూ.2.23 కోట్లను పోర్టు కేటాయించినట్టు తెలిపారు. విశాఖపట్నం పోర్టు, జివిఎంసి కలిసి అన్ని ప్రదేశాలనూ పచ్చదనంతో నింపుతున్నాయన్నారు. భీమిలి నుంచి విశాఖపట్నం పోర్టు ప్రాంతం వరకు మడ అడవులను పెంచే ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి అదనపు కమిషనర్ కెఎస్.విశ్వనాథ్, పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, పోర్టు డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్ కుమార్ దూబె, పోర్టు విభాగాధిపతిలు, అధికారులు పాల్గొన్నారు.

ఎపిలో పోటీకి సిద్ధం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తున్నట్లు సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు తెలిపారు. తమ పార్టీకి ఎపిలో పోటీ చేసేందుకు సైకిల్‌కు గాలి కొడుతున్న పంపు గుర్తును ఎన్నికల కమిషన్ కేటాయించిన సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం నుంచి అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతం ఎక్కువగా వున్న ఉత్తరాంధ్ర నేటికీ వెనుకబడి వుందన్నారు. తాము అధికారంలోకి వస్తే అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ నేత బొట్టా మధు యాదవ్, ఉత్తరాంధ్ర ఇంఛార్జి, మహిళా అధ్యక్షురాలు డాక్టర్ జాలాది విజయ, జగదీష్ పాల్గొన్నారు.

'వండర్ కిడ్స్'లో ఢిల్లీ విద్యావేత్తల బృందం పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు క్రమశిక్షణ, సంస్కృతి సంప్రదాయాలను సమపాళ్లలో అందిస్తున్న స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ఓ అద్భుతమని ఢిల్లీ విద్యావేత్తల బృందం కొనియాడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ మెంటార్ కృష్ణారెడ్డి, విశాఖపట్నం అపుస్మా సభ్యులు ఎంవివి సత్యనారాయణతో పాటు ఢిల్లీ, హర్యానా నుంచి ఆరుగురు విద్యావేత్తల బృందం శుక్రవారం ఉదయం సిరిపురంలోని వండర్ కిడ్స్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడి చిన్నారులు అసాధారణ ప్రతిభ కనబరిచారన్నారు. గతంలో విద్యావిధానాన్ని పరిశీలించడం కోసం ఫిన్‌ల్యాండ్, జర్మనీ, ఆస్ట్రేలియా, జపాన్, సౌత్ కొరియా వంటి దేశాలకు తమ బృందం వెళ్లి అధ్యయనం చేసిందన్నారు. కార్యక్రమంలో భాగంగా వండర్ కిడ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ మళ్ల రామనాయుడును వారు అభినందించారు. ఢిల్లీ నుండి వచ్చిన బృందంలో ఉమాశర్మ, హేమ, విశాల్, సందీప్, ఆష్‌తోష్, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు సభ్యులుగా ఉన్నారు.

ఘనంగా భూలోకనాయుడు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -కశింకోట : జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు వియ్యపు భూలోకనాయుడు జన్మదిన వేడుకలు శుక్రవారం కసింకోట ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు ఆధ్వర్యంలో తాళ్ళపాలెం జంక్షన్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తీడ సర్పంచ్ చిరికి సత్యనారాయణ, తాళ్లపాలెం మాజీ సర్పంచ్ చిన్ని వల్లభ నారాయణరావు, నమ్మి గణేష, ఇందల ముసలి నాయుడు, ఉగ్గినపాలెం పాల సంఘం అధ్యక్షులు గాలి శ్రీనివాస్, నమ్మి గణేష్, వైసిపి నాయకులు కొండ్ర శ్రీను, నిమ్మదాల చిట్టి నాయుడు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయండి

మాట్లాడుతున్న వైవి.సుబ్బారెడ్డి, వేదికపై బొత్స, కృష్ణదాస్, అమర్, ఝాన్సీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎన్నికల్లో వైసిపి విజయం కోసం పార్టీ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బీచ్ రోడ్‌లో విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అందరికీ సంక్షేమం అందుతోందన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్రాన్ని ఏమాత్రమూ అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాసు, విశాఖ ఎంపీ సత్యనారాయణ, జిల్లా పరిషత్ ఛైర్మన్ సుభద్ర, నగర మేయర్ హరి వెంకట కుమారి, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

'నీటి సరఫరా, యుజిడి నియామకాల్లో అక్రమాలు'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసిలో నీటి సరఫరా, యుజిడి నియామకాలలో, ప్రమోషన్లలో అక్రమాలు జరుగుతున్నాయని, సమగ్ర విచారణ జరపాలని జివిఎంసి వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యకులు పి.వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జివిఎంసి నీటి సరఫరా, యుజిడి విభాగాలలో అప్కాస్ వచ్చిన తర్వాత చేపట్టిన 96 మంది నియామకాలలో, 2013 తర్వాత చనిపోయిన, రిటైర్ అయిన కార్మికుల వివరాలు ప్రకారం వారి బిడ్డలకు అవుట్ సోర్సింగ్ ఉపాధి కల్పనలో జరిగిన అన్యాయంపైనా, ప్రమోషన్లలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపైనా పూర్తి విజిలెన్స్ విచారణ జరగాల్సి ఉందన్నారు.

అవినీతి, అక్రమాలకు బాధ్యులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మను కోరారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.ఆనంద్ కుమార్, ఉపాధ్యక్షులు డి.శంకర్ రెడ్డి, రాజు, కె.వెంకట్రావు, త్రినాథ్, సత్యనారాయణ, చలపతి, చిన్నారావు పాల్గొన్నారు.

మహిళలు చైతన్యంతో రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పవిత్రమైన భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని, అటువంటి కుట్రలను మహిళలు చైతన్యవంతంతో పోరాడి ఎదుర్కోవాలని సామాజికవేత్త డాక్టర్ కె.రమాప్రభ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎన్ఎడి కొత్తరోడ్డులోని యుటిఎఫ్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు, ఐద్వా ఆధ్వర్యంలో మహిళల సమస్యలు, కర్తవ్యాలు అన్న అంశంపై సదస్సు జరిగింది. యుటిఎఫ్ జిల్లా సహ అధ్యక్షురాలు రొంగలి ఉమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డాక్టర్ రమాప్రభ మాట్లాడుతూ ఇటీవల పని ప్రదేశాల్లో మహిళలపై అనేక విధాలుగా దాడులు జరుగుతున్నాయన్నారు. అటువంటి పరిస్థితుల్లో మహిళలు చైతన్యవంతులై హక్కులను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే శక్తులను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్.నాగమణి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ, పుణ్యవతి, చినగదిలి మండల ప్రధాన కార్యదర్శి పద్మావతి, ఉపాధ్యాయులు, శ్రామిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వివేకా హత్య కేసు దర్యాప్తు నివేదికను బయటపెట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య జరిగి ఐదు సంవత్సరాలు అవుతోందని, నేటికీ సిబిఐ దర్యాప్తు నివేదికను ఎందుకు బహిర్గత పరచలేదని వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ప్రశ్నించారు. కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం మార్కెట్ యార్డ్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి, వైఎస్ వివేకానంద రెడ్డి ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దర్యాపు నివేదిక బయట పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అస్తవ్యస్త రోడ్డును శుభ్రం చేయించిన కార్పొరేటర్

ప్రజాశక్తి-పరవాడ

జివిఎంసి 79వ వార్డు లంకెలపాలెం జంక్షన్ వద్ద రోడ్డు పెచ్చులూడి అస్తవ్యస్తంగా మారడంతో స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించి, జీవీఎంసీ వాహనాలను రప్పించి శుక్రవారం చేయించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎర్ర కోటేశ్వరావు, దాసరి రామారావు, చలపరెడ్డి రామారావు, వెల్డింగ్ శ్రీను, గోరుపూటి దేవుడు, రౌతు రామచంద్రరావు, శంకర్రావు, మడక రమేష్ నాయుడు, తణుకు సత్యనారాయణ పాల్గొన్నారు.

కేసు కొట్టివేత అనంతరం లాయర్‌తో సిపిఎం నాయకులు

సిపిఎం నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 2016లో ఎంఎల్‌సి ఎన్నికల్లో ఆరుగురు సిపిఎం నాయకులపై అక్రమంగా పెట్టిన కేసును విశాఖపట్నం రెండో మెట్రోపాలిటన్ కోర్టు శుక్రవారం కొట్టివేసింది. సుమారు 8 సంవత్సరాలు సుదీర్ఘంగా సాగిన వాదనల్లో సిపిఎం నాయకులకూ, ఈ కేసుకూ ఎటువంటి సంబంధం లేదని కోర్టు తెలిపింది. నాయకులు కె.లోకనాథం, వివి.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, ముక్కు సుబ్బారావు, వై.రాజు, ఆర్ఎన్.మాధవిలను నిర్దోషులుగా ప్రకటించింది. ప్రజా ఉద్యమాలే ఊపిరిగా, నీతి నిజాయితీగా పని చేస్తున్న సిపిఎం నాయకులు కోర్టు కేసులకు జడవరని ఈ సందర్భంగా లోకనాథం అన్నారు. ఈ కేసును సీనియర్ న్యాయవాది బివి.రామాంజనేయరావు, వారి జూనియర్ లాయర్స్ చిత్తరంజన్, వెంకట్, సుహాసిని వాదించారు. వారికి సిపిఎం జిల్లా కమిటీ అభినందనలు తెలిపింది.

ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ధాన్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో గవర్నమెంట్ కంటి హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని శుక్రవారం ఉదయం కొత్త జాలారిపేటలోని రామమందిరం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఉచితంగా కళ్లజోళ్లు అందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శస్త్ర చికిత్సలూ చేయించనున్నామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ యంయం.మహేష్, అశోక్ కుమార్ అగర్వాల్, మాణిక్యాలరావు, వి.శీనివాసరావు, డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ స్నేహ, డాక్టర్ రిషిత, ఆర్.వసంత్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

17న బిజెపి వైఫల్యాలపై సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 'బిజెపి వాగ్దానాలు, వైఫల్యాలు' అంశంపై ఈ నెల 17న సాయంత్రం 5 గంటలకు అంబేద్కర్ భవనంలో జిల్లాస్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు భారత బచావో జిల్లా కన్వీనర్ గూడూరు సీతామహాలక్ష్మి, కార్యదర్శి డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూఈ సదస్సుకు ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు తెలిపారు. 2014లో బిజెపి అధికారం చేపట్టిన నుంచీ దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్నారు. స్విస్ బ్యాంక్ ఖాతాలు బయటపెడతానన్న మోడీ ఇప్పుడు ఎలక్టోరల్ బాండ్ల విషయంలో స్టేట్ బ్యాంక్ ఖాతాలను కూడా బయటపెట్టలేకపోతున్నారని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తానని చెప్పిన మోడీ అధికారం చేపట్టాక ఆ హామీని విస్మరించారన్నారు. ఆయన పాలనలో ఉద్యోగాలు పోగొట్టుకున్న వారి సంఖ్య రెండు కోట్లు పైమాటే ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. సమావేశంలో వేమన, బి.వెంకటపతిరాజు పాల్గొన్నారు.

కాపులను మోసం చేసిన వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి -అనకాపల్లి : వైసిపి ప్రభుత్వం రిజర్వేషన్ల పేరుతో కాపులను మోసం చేసిందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఐదు శాతం రిజర్వేషన్ల హామీకి కట్టుబడి ఉందని టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ వెల్లడించారు. స్థానిక గవరపాలెం టిడిపి కార్యాలయంలో శుక్రవారం కసింకోట మండల టిడిపి, జనసేన, బిజెపి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని తూర్పు కాపులకు సర్టిఫికెట్లు ఇస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు గోవింద సత్యనారాయణ, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు, పార్టీ నాయకులు కాయల మురళి, బుద్దిరెడ్డి చిన్నా, ఉగ్గిన రమణ మూర్తి, నిమ్మధల సత్యనారాయణ, పెంటకోట రాము, గొంతిన శ్రీనివాసరావు, గల్లా కొండలరావు, కరక సత్యనారాయణ పాల్గొన్నారు.